సాక్షి
కామారెడ్డి
బుధవారం । 3 । సెప్టెంబర్ । 2025



మరమ్మతులు పూర్తి చేయాలి

వర్షాలతో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులను త్వరగా పూర్తి చేయించాలని సబ్‌కలెక్టర్ కిరణ్మయి అధికారులకు సూచించారు.

- 8లో ▸



అంతర్రాష్ట్ర దొంగల ముఠా..

జిల్లాలో దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యుడిని పట్టుకున్నట్లు ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.1 /21.7

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

పుత్తడి పరుగులు

కామారెడ్డి టౌన్: పసిడి ధర పరుగులు పెడుతోంది. గతనెల ప్రారంభంలో 10 గ్రాముల బంగారం ధర లక్ష రూపాయలలోపు ఉండగా.. చివరి నాటికి 1.05 లక్షలకు చేరింది. మంగళవారం రూ. 1,07,500 లకు చేరుకుంది. వెండి ధర కూడా పెరుగుతూ వస్తోంది. మంగళవారం కామారెడ్డి మార్కెట్‌లో తులం వెండి ధర రూ. 1,280 ఉంది. పెరుగుతున్న ధరలను చూసి ప్రజలు అవాక్కవుతున్నారు. బంగారం కొనే పరిస్థితి లేదని ఆవేదన చెందుతున్నారు.

బాధితులకు ఎస్‌ఆర్ ఫౌండేషన్ భరోసా



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : వరదలతో సర్వం కోల్పోయినవారికి వ్యాపారవేత్త తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డికి చెందిన ఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిత్యావసరాలు అందజేశారు. కామారెడ్డి పట్టణంలోని జీఆర్ కాలనీ, కౌండిన్య కాలనీ, హౌజింగ్ బోర్డు కాలనీలతో పాటు మరికొన్ని కాలనీలలో ఒక్కో కుటుంబానికి రూ.3 వేల విలువ గల బియ్యం, ఇతర సామగ్రిని అందించి భరోసా కల్పించారు. చాలామంది పిల్లల పుస్తకాలు, నోట్‌బుక్స్ నీటిపాలయ్యాయని, వారికి పుస్తకాలు ఇప్పిస్తామని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు వెంకట్‌గౌడ్, మట్ట శ్రీనివాస్, అశోక్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రాంరెడ్డి, రాజాగౌడ్, నాగరాజ్‌రెడ్డి, శంకర్‌గౌడ్, పైడి రాంరెడ్డి, పర్శరాములు, శేఖర్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్ సరఫరా చేయండి'



విద్యుత్‌వైర్లను పరిశీలిస్తున్న ఎస్‌ఈ శ్రావణ్‌కుమార్, అధికారులు

నాగిరెడ్డిపేట: పంటలకు నీరందించేందుకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ శ్రావణ్‌కుమార్ సూచించారు. మంగళవారం ఆయన పోచారం ప్రాజెక్టు సమీపంలో నీటమునిగి తేలిన పంటలను పరిశీలించారు. వరదనీరు వెళ్లిపోయినందున పంటలకు నీరందించేందుకు విద్యుత్ సరఫరా చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయనవెంట ఏఈ నాగరాజు, సిబ్బంది ఉన్నారు.

నిజాంసాగర్‌లోకి భారీ వరద



సింగితం నుంచి విడుదలవుతున్న నీరు

నిజాంసాగర్: కర్ణాటక, మహారాష్ట్రల్లో కురుస్తున్న వర్షాలకు సింగూరు ప్రాజెక్టు ద్వారా నిజాంసాగర్ ప్రాజెక్టులోకి భారీ వరద వస్తోంది. మంగళవారం 80,204 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 14 వరద గేట్లను ఎత్తి 97,070 క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నామన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1,401.70 అడుగుల (13.319 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

సింగితం రిజర్వాయర్‌లోకి..

ఎగువన కురుస్తున్న వర్షాలవల్ల మహమ్మద్‌నగర్ మండలంలోని సింగితం రిజర్వాయర్‌లోకి 1,150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో అంతే నీటిని రిజర్వాయర్ మూడు వరద గేట్లను ఎత్తి నిజాంసాగర్ ప్రధాన కాలువకు మళ్లిస్తున్నారు.

కౌలాస్‌లోకి 1,430 క్యూసెక్కులు..

జుక్కల్ మండలంలోని కౌలాస్ ప్రాజెక్టులోకి మంగళవారం 1,430 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. కౌలాస్ ప్రాజెక్టు ఒక గేటు ద్వారా 1,801 క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నారు. కౌలాస్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 458 మీటర్లు (1.237 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 457.65 మీటర్ల (1.152 మీటర్లు) నిల్వ ఉంది.

ధీర వనితలు

వానొస్తుందని ఇంట్లోనే ఉండిపోలేదు. ఎదురైన విపత్తును చూసి వెనుకంజ వేయలేదు. ధైర్యంగా అడుగు ముందుకు వేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో.. ప్రమాదకర పరిస్థితుల్లోనూ పర్యటించారు. బాధితులకు మేమున్నామన్న భరోసా ఇచ్చారు. ఆపద నుంచి ప్రజలను కాపాడేందుకు శ్రమించారు. విపత్కర పరిస్థితుల్లోనూ వెన్నుచూపని ఆ ధీర వనితలు.. విధి నిర్వహణలో తమ అంకితభావంతో ఆదర్శంగా నిలిచారు.

- వరద ప్రభావిత ప్రాంతాల్లో ధైర్యంగా విధి నిర్వహణ
- విపత్తు నుంచి ప్రజలను కాపాడేందుకు శ్రమించిన పలువురు
- మహిళా అధికారుల సేవలను ప్రశంసిస్తున్న ప్రజలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు వణికించాయి. వినాయక చవితి పండుగ రోజున ఒక్కసారిగా దంచికొట్టిన వాన జిల్లాను అతలాకుతలం చేసింది. జిల్లా కేంద్రంతోపాటు పలు ప్రాంతాలను భారీ వరదలు ముంచెత్తాయి. దీంతో జనజీవనం అతలాకుతలం అయ్యింది. ప్రధానంగా కామారెడ్డి పట్టణంలో పలు కాలనీలు నీట మునిగాయి. అలాగే వివిధ మండలాల్లో వాగులు పొంగి ప్రవహించి రోడ్లు కొట్టుకుపోయి ఊళ్ల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వాగులు, నదుల్లో ఎందరో చిక్కుకుపోయారు. అలాంటి సమయంలో ప్రజలను ఆదుకునేందుకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్ చంద్రలతోపాటు జిల్లాలోని అధికార యంత్రాంగం మొత్తం రంగంలోకి దిగింది. కలెక్టర్, ఎస్పీ అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేసి వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నారు. దీంతో చాలావరకు వరదల్లో చిక్కుకున్నవారు సురక్షిత ప్రాంతాలకు చేరగలిగారు. ఈ క్రమంలో మహిళా అధికారులు నిర్వహించిన పాత్ర ఎనలేనిది. వారు వారం రోజులుగా రేయింబవళ్లు బాధ్యతగా విధులు నిర్వహించి ఉన్నతాధికారుల మన్ననలు పొందారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, వైద్యాధికారులు, పోలీసు అధికారులు, ఆయా శాఖల సిబ్బంది వరదలు సృష్టించిన విపత్తును ఎదుర్కొనడంలో ఎవరి స్థాయిలో వారు శ్రమించారు. పండుగ పూట కూడా విధుల్లో కొనసాగారు. వ్యవసాయ శాఖలోని మహిళా ఉద్యోగులు సైతం వరద ప్రభావిత ప్రాంతాలలో పర్యటించి, పంటలను పరిశీలించారు. రైతులకు సలహాలు, సూచనలందించారు. వర్షాల అనంతరం పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చూసిన పారిశుద్ధ్య కార్మికుల సేవలూ వెలకట్టలేనివి.



కామారెడ్డిలో రెస్క్యూ ఆపరేషన్‌లో ఏఎస్పీ చైతన్యరెడ్డి

బీబీపేట చెరువు వద్ద రెస్క్యూ ఆపరేషన్‌ను పర్యవేక్షిస్తున్న కామారెడ్డి ఆర్డీవో వీణ

వరద ప్రభావిత ప్రాంతంలో పర్యటిస్తున్న బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి

పాల్వంచ వాగు వద్ద రెస్క్యూ బృందంతో తహసీల్దార్ హిమబిందు

గాంధారి చెరువు అలుగు వద్ద రెస్క్యూ బృందంతో తహసీల్దార్ రేణుకా చౌహాన్

బీబీపేట పెద్ద చెరువుకు బుంగకు మరమ్మతులు చేయిస్తున్న ఇరిగేషన్ ఏఈ రవళిక

సహాయక చర్యల్లో ఆర్డీవో వీణ...

కామారెడ్డి ఆర్డీవో వీణ డివిజన్‌లోని ఆయా మండలాల్లో వరద సహాయక చర్యల్లో శ్రమించారు. పట్టణ పరిధిలోని పలు కాలనీలతో పాటు వివిధ మండలాల్లో వరదలో చిక్కుకున్న వారిని రెస్క్యూ చేయడంతో పాటు వారికి ఆశ్రయం కల్పించడానికి ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రాంతాల్లో పర్యటించి సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

బాధితులకు భరోసాగా కిరణ్మయి..

యువ ఐఏఎస్ అధికారి, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి వరదలు సృష్టించిన విపత్తులో కీలకంగా పనిచేశారు. మంజీరలో చిక్కుకున్న గొర్రెల కాపరులను రక్షించేందుకు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా బిచ్కుంద మండలంలో మకాం వేసి రెస్క్యూ టీంలకు దిశానిర్దేశం చేశారు. తాను కూడా బోటులో బాధితుల వద్దకు వెళ్లి పరామర్శించి, ధైర్యం చెప్పారు. వరదల సమయంలో ఆమె రాత్రింబవళ్లు శ్రమించారు. వరదలతో ఇళ్లు మునిగిపోవడంతో నిరాశ్రయులైన పలు గ్రామాల ప్రజలను సురక్షితంగా బయటకు తీసుకువచ్చి వారికి ఆశ్రయం కల్పించడంలో సమర్థవంతమైన సేవలను అందించి ప్రజల మన్ననలు పొందారు.



రెస్క్యూ బృందంతో కిరణ్మయి

'చైతన్య'వంతమైన పాత్ర..



కామారెడ్డిలో వరద ప్రభావిత ప్రాంతానికి పొక్లెయిన్‌పై వెళుతున్న ఏఎస్పీ చైతన్యరెడ్డి

యువ ఐపీఎస్ అధికారి, కామారెడి అసిస్టెంట్ ఎస్పీ చైతన్యరెడ్డి ఉద్యోగంలో చేరిన తర్వాత తొలి సవాల్‌ను ఎదుర్కొన్నారు. ఎదురైన విపత్తును ఆమె సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. కామారెడ్డిలోని జీఆర్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీలను వరద ముంచెత్తి వందలాది మంది జలదిగ్బంధంలో చిక్కుకుపోయిన సమయంలో ఆమె క్రియాశీలకంగా పనిచేశారు. చిమ్మచీకట్లో వరద ప్రవాహాన్ని దాటేందుకు పొక్లెయిన్‌పై ఎక్కి బాధితుల వద్దకు వెళ్లారు. ఆయా కాలనీలలో వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు స్థానిక అధికారులకు దిశానిర్దేశం చేశారు. బాధితులను క్షేమంగా బయటకు తీసుకురావడంలో చైతన్యరెడ్డి పాత్ర ఎంతో ఉంది.

చెరువు వద్ద జాగారం చేసిన ఏఈ రవళిక

భారీ వరదలతో బీబీపేట పెద్ద చెరువుకు బుంగపడింది. సమాచారం అందిన వెంటనే పరిస్థితిని తెలుసుకునేందుకు నీటిపారుదల శాఖలో బీబీపేట ఏఈగా పనిచేస్తున్న రవళిక వెళ్లారు. రాత్రంతా అక్కడే ఉండి తాత్కాలిక మరమ్మతులను పరిశీలించారు.

రెస్క్యూ ఆపరేషన్‌లో రేణుకా చౌహాన్

కామారెడ్డి నుంచి బాన్సువాడ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఈనెల 27న రాత్రి 8 గంటల సమయంలో సర్వాపూర్ వాగు వంతెనపైనుంచి వెళ్తుండగా మధ్యలో నిలిచిపోయింది. ఆ సమయంలో బస్సులో డ్రైవర్, కండక్టర్‌తో పాటు ఆరుగురు ప్రయాణికులున్నారు. వంతెనపైనుంచి వాగు పారుతుండడంతో భయాందోళనలతో గడిపారు. విషయం తెలుసుకున్న గాంధారి తహసీల్దార్ రేణుకా చౌహాన్ రెస్క్యూ బృందంతో వెళ్లి సహాయక చర్యలను చేపట్టి సురక్షితంగా ఒడ్డుకు చేర్చగలిగారు.

సహాయక చర్యల్లో హిమబిందు

పాల్వంచ తహసీల్దార్ హిమబిందు వరద సహాయక చర్యల్లో క్రియాశీలకంగా పాల్గొన్నారు. పాల్వంచ వాగులో చిక్కుకుపోయిన ఇద్దరు రైతులను కాపాడడానికి ఆమె వేగంగా స్పందించి రెస్క్యూ టీంను రప్పించారు. సకాలంలో సాయం అందడంతో ఇద్దరు రైతులు సురక్షితంగా బయటకు రాగలిగారు. మండలంలో ఇతర సహాయక చర్యల్లోనూ ఆమె చురుకుగా పాల్గొన్నారు.

కాళేశ్వరంపై కుట్రలు చేస్తున్నారు



జిల్లా కేంద్రంలో ధర్నాలో పాల్గొన్న గంప గోవర్ధన్, బీఆర్‌ఎస్ నాయకులు

- మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్
- ప్రభుత్వ వైఖరికి నిరసనగా జిల్లా కేంద్రంలో ధర్నా

కామారెడ్డి క్రైం: కాళేశ్వరంపై కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ప్రభుత్వ వైఖరికి నిరసనగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో మంగళవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా గంప గోవర్ధన్ మాట్లాడుతూ కాళేశ్వరాన్ని ఎండబెట్టి తెలంగాణ నదీ జలాలను పక్క రాష్ట్రాలకు తరలించే కుట్ర ఇదన్నారు. కాళేశ్వరం అంశాన్ని సీబీఐకి అప్పగించడమంటే పూర్తిగా ప్రాజెక్టును మూసేయడమేనన్నారు. ఓవైపు రైతులు పంటలకు యూరియా లేక అల్లాడిపోతుంటే పట్టించుకునే వారే కరువయ్యారని ప్రభుత్వాన్ని విమర్శించారు. ఇప్పటి వరకు సీబీఐ గురించి వ్యతిరేకంగా మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కరోజులోనే ఎందుకు మాట మార్చాడో చెప్పాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును సీబీఐకి అప్పజెప్పడాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు కుంబాల రవి యాదవ్, లక్ష్మీనారాయణ, బల్వంత్‌రావు, భానుప్రసాద్ పాల్గొన్నారు.

రేపు జిల్లాకు సీఎం రాక!

- వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటనకు ఏర్పాట్లు
- నష్టంపై అధికారులతో సమీక్షించే అవకాశం



నాగిరెడ్డిపేటలోని వ్యవసాయ కళాశాల భవనం పరిసరాలను పరిశీలిస్తున్న ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరావు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : భారీ వర్షాలతో అతలాకుతలమైన కామారెడ్డి జిల్లాలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించనున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం సీఎం పర్యటన ఏర్పాట్లలో నిమగ్నమైంది. అయితే ఎక్కడెక్కడ పర్యటిస్తారన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది. వర్షాల ప్రభావం ఎలా ఉంటుందన్నదాని ఆధారంగా సీఎం పర్యటన ఉండే అవకాశాలున్నాయి.

జిల్లాలో ఇటీవల భారీ వర్షాలు కురిసిన విషయం తెలిసిందే. జిల్లాకేంద్రంలోని పలు కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఈ నేపథ్యంలో గతనెల 28న సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపల్లి పర్యటన అనంతరం కామారెడ్డి జిల్లా కేంద్రానికి వచ్చి పరిస్థితిని తెలుసుకోవాల్సి ఉండగా.. వాతావరణం అనుకూలించకపోవడంతో హెలీకాప్టర్ ఇక్కడ ల్యాండ్ కాలేకపోయింది. తాజాగా ఆ పర్యటనను ఖరారు చేశారు. జిల్లాలో పరిస్థితిని తెలుసుకునేందుకు రేవంత్‌రెడ్డి గురువారం జిల్లాకు రానున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో జరిగిన నష్టాన్ని సీఎం ప్రత్యక్షంగా పరిశీలించనున్నారు. లింగంపేట, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, మహ్మద్‌నగర్ మండలాలతో పాటు కామారెడ్డి పట్టణంలో సీఎం పర్యటన ఉండే అవకాశాలున్నాయి. వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలన అనంతరం వరద నష్టంపై జిల్లా అధికారులతో సీఎం సమీక్షిస్తారని తెలుస్తోంది.

దీంతో అధికారులు సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. పంట నష్టం, ఆస్తి నష్టంతోపాటు రోడ్లు, వంతెనలు ధ్వంసమవడం, పోచారం ప్రాజెక్టు, చెరువులు దెబ్బతినడం వంటి వాటికి సంబంధించి నష్టాలు, పునర్నిర్మాణానికి అయ్యే వ్యయానికి సంబంధించిన ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. సీఎం జిల్లాలో పరిస్థితిని సమీక్షించిన తర్వాత వరద పీడిత ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటిస్తారని జిల్లాకు చెందిన అధికార పార్టీ నేతలు ఆశతో ఉన్నారు.

వ్యవసాయ కళాశాల భవనం పరిశీలన

నాగిరెడ్డిపేట : సీఎం పర్యటిస్తారన్న సమాచారం మేరకు మంగళవారం ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరావు మండలంలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల భవనాన్ని పరిశీలించారు. జిల్లాలో జరిగిన వరద నష్టంపై సీఎం మండలంలోని పాలిటెక్నిక్ కళాశాల భవనంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారని ప్రాథమికంగా సమాచారం అందిందని ఆర్డీవో తెలిపారు. అనంతరం అధికారులు పోచారం ప్రాజెక్టును కూడా పరిశీలించారు. వారివెంట నాగిరెడ్డిపేట తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎస్సై భార్గవ్‌గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరాంగౌడ్ ఉన్నారు.

నిమజ్జనానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



టేక్రియాల్ చెరువు వద్ద ఏర్పాట్ల గురించి తెలుసుకుంటున్న కలెక్టర్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్ చంద్ర

కామారెడ్డి క్రైం: ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. ఎస్పీ రాజేశ్ చంద్రతో కలిసి నిమజ్జనోత్సవం జరిగే టేక్రియాల్ వద్దనున్న అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువును మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువులో 7 వందలకుపైగా వినాయక ప్రతిమలను నిమజ్జనం చేసే అవకాశం ఉందన్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని అన్ని రకాలుగా ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. చెరువు లోనికి ఎవరు పడితే వారు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. క్రేన్లు, గజఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. వాటర్ ప్రూఫ్ షామియానాలు ఏర్పాటు చేసి రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, ఫిషరీస్, ఫైర్ శాఖల ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. గణేశ్ విగ్రహాలకు తగలకుండా విద్యుత్ వైర్ల ఎత్తు పెంచాలని సూచించారు. శోభాయాత్ర వచ్చే రహదారికి మరమ్మతులు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. ఈనెల 4 నుంచి 6 వరకు అధిక సంఖ్యలో వినాయక విగ్రహాలు నిమజ్జనానికి వస్తాయన్నారు. గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం వినాయక శోభాయాత్ర జరిగే రహదారిని పరిశీలించారు. కార్యక్రమంలో కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి, ఆర్డీవో వీణ, తహసీల్దార్ జనార్దన్, మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం అందించాలి



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంతో పాటు రాజంపేట మండలంలో వరద ప్రభావానికి గురైన కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించాలని కలెక్టర్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలోని జీఆర్ కాలనీలో పర్యటించారు. అధిక వర్షాల కారణంగా వరద ప్రభావానికి గురైన కుటుంబాలకు ఇప్పటికే తాత్కాలిక నష్టపరిహారం అందించామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు దుప్పట్లు, చీరలు, బియ్యం, పప్పులు, ఇతర నిత్యావసర సరకులను అందిస్తున్నామన్నారు. వాటిని రెవెన్యూ అధికారులు బాధితులకు పంపిణీ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో వీణ, తహసీల్దార్ జనార్దన్, మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కవిత సస్పెన్షన్‌పై గులాబీ శ్రేణుల్లో చర్చ

- కొంతకాలంగా ఎమ్మెల్సీకి దూరంగా జిల్లా నేతలు
- సస్పెన్షన్ సరైనదేనంటున్న బీఆర్‌ఎస్ నేతలు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కవితను బీఆర్‌ఎస్ పార్టీ సస్పెండ్ చేయడం జిల్లాలో చర్చనీయాంశమైంది. ఈ చర్యతో గులాబీ శ్రేణులు ఒకింత ఆందోళనకు గురయ్యారు. ఎమ్మెల్సీ కవిత కొంతకాలంగా పార్టీని కాదని జాగృతి పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్ నేతలు చాలామంది ఆమెకు దూరంగా ఉంటున్నారు. కొన్నాళ్ల క్రితం కామారెడ్డిలో నిర్వహించిన బీసీ సదస్సుకు కొందరు నేతలు హాజరైనా.. తర్వాత వారు కూడా ఆమెకు దూరంగా ఉంటున్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చెందిన సంపత్‌గౌడ్ తెలంగాణ జాగృతి జిల్లా బాధ్యతలు చూస్తున్నారు.

పార్టీతోపాటు పార్టీ నేతలపై ఎమ్మెల్సీ కవిత చేసిన విమర్శల నేపథ్యంలో బీఆర్‌ఎస్ శ్రేణులు ఆందోళనకు గురయ్యారు. అసలేం జరుగుతోందంటూ చర్చించుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతంటూ ప్రభుత్వం సీబీఐ విచారణ కోరడం, దీనిపై కవిత స్పందించి హరీశ్‌రావు, సంతోష్‌రావులను టార్గెట్ చేయడంతో ఆమెను పార్టీ సస్పెండ్ చేసింది. ఈ విషయం రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

సరైన నిర్ణయం : గంప గోవర్ధన్

బీఆర్‌ఎస్ పార్టీ ఏ ఒక్కరిదో కాదని, 60 లక్షల మంది కార్యకర్తల సొంతమని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పేర్కొన్నారు. పార్టీకి నష్టం కలిగిస్తే ఎంతటి వారిపైనైనా చర్యలు ఉంటాయన్నారు. మంగళవారం ఆయన కామారెడ్డిలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత కొంతకాలంగా పార్టీకి నష్టం కలిగేలా ప్రకటనలు చేస్తున్నారని, ఇది అందరినీ బాధించిందని పేర్కొన్నారు. ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. పార్టీ అధినేత కేసీఆర్‌కు ప్రజలు, కార్యకర్తలే ముఖ్యమని, పార్టీకి నష్టం కలిగించేవారు ఎంతటివారైనా క్రమశిక్షణా చర్యలు తీసుకుంటారని దీనిద్వారా స్పష్టమైందని పేర్కొన్నారు.

స్వాగతిస్తున్నాం..

ఎమ్మెల్సీ కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేయడాన్ని స్వాగతిస్తున్నామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ అన్నారు. పార్టీలో పెద్దా, చిన్నా అనేది ఉండదని, తప్పు ఎవరు చేసినా క్రమశిక్షణా చర్యలు ఉంటాయని స్పష్టమైందని పేర్కొన్నారు.

క్లుప్తంగా

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని షీటీమ్ బృందం సభ్యులు అన్నారు. మంగళవారం లింగంపేట పీహెచ్‌సీలో అవగాహన కల్పించారు. ఈవ్ టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, మహిళల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, బాల కార్మికులు, పని వేధింపులు తదితర విషయాలపై వివరించారు. ఎవరైనా వేధించినా, మోసపోయినా టోల్ ఫ్రీ నంబర్ 1930కు, 100 నంబర్లకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. షీ టీమ్ టోల్ ఫ్రీ నంబర్ 8712686094 కాల్ చేయాలని సూచించారు. వైద్యులు రాంబాయి, సిబ్బంది పాల్గొన్నారు.

తాడ్వాయి బాలికల గురుకులంలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని, రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై మురళి అన్నారు. తాడ్వాయి బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రిన్స్‌పల్ సురేఖ, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్‌దారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు



దోమకొండ: మండలంలో పింఛన్లు పంపిణీ చేసే పోస్టాఫీసును మంగళవారం ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ పరిశీలించారు. వృద్ధులు, మహిళలతో మాట్లాడారు. అదనంగా మరో మిషన్‌ను తెప్పించి రెండు మిషన్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేశారు. పింఛనుదారులు ఎలాంటి ఇబ్బందులు పడొద్దని, మరో రెండు రోజుల పాటు పింఛన్ అందజేస్తామని ఆయన తెలిపారు. వృద్ధులు, వికలాంగులకు ముందుగా అందించాలని పోస్టాఫీస్ కార్యాలయ సిబ్బందికి సూచించారు. పంచాయతీ కార్యదర్శి యాదగిరి, పోస్టుమాస్టర్ ఉన్నారు.



బాన్సువాడలో .. ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్



జిల్లా కేంద్రంలో.. డీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ నేతలు



పూలమాల వేస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి

వైఎస్సార్ ఆదర్శప్రాయుడు

సాక్షి నెట్‌వర్క్: మహానేత, దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆదర్శప్రాయుడని కాంగ్రెస్ నేతలు కొనియాడారు. మంగళవారం వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడారు. వైఎస్ అంటేనే కాంగ్రెస్ అనేలా పార్టీని ఉమ్మడి రాష్ట్రంలో బలోపేతం చేశారని గుర్తు చేశారు. పేదవాడిని బతికించేలా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేశారని అన్నారు. ప్రస్తుతం ఉన్న ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలు ఆయన తెచ్చినవే అని గుర్తు చేశారు. ఆయన హయాంలో రాష్ట్రం అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచిందని కొనియాడారు.



భిక్కనూరులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి తదితరులు



గాంధారి మండలం పోతంగల్ కలాన్‌లో..



నాగిరెడ్డిపేటలో ..



దోమకొండలో ..



బిచ్కుందలో..



పిట్లంలో..



లింగంపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..



మాచారెడ్డి మండలం గజ్యానాయక్ తండా చౌరస్తాలో ..



బీర్కూర్‌లో ..



తాడ్వాయి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..

ఎస్టీ జాబితా నుంచి తొలగిస్తే ఊరుకోం

- ఆలిండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోహన్ నాయక్

బాన్సువాడ: బంజారాలను ఎస్టీ జాబితా నుంచి తొలగిస్తే చూస్తూ ఊరుకోమని ఆలిండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోహన్ నాయక్ అన్నారు. మంగళవారం బాన్సువాడలో ఆయన మాట్లాడుతూ.. బంజారాలను ఎస్టీ జాబితాలో నుంచి తొలగించాలని ఆదివాసి నాయకులు సోయం బాపూరావు, తెల్లం వెంకట్‌రావు సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారని, రాష్ట్రంలో ఉన్న 10 శాతం గిరిజనుల్లో 7 శాతం బంజారాలే ఉన్నారని, మిగతా 3 శాతం ఆదివాసులు ఉన్నారని గుర్తు చేశారు. ఆదివాసీలకు మంచి చేయాలంటే చేయండి కానీ బంజారాల జోలికొస్తే ఊరుకునేది లేదన్నారు. సంఘం నాయకులు బన్సీలాల్, భాస్కర్, నరేష్, ప్రేమ్‌సింగ్, జగ్రం, చందర్, శ్రీనివాస్, ధన్‌సింగ్ తదితరులున్నారు.



బాన్సువాడలో మాట్లాడుతున్న బంజారా నేతలు

రోడ్డు మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలి

- సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడరూరల్/మద్నూర్(జుక్కల్): వరద వల్ల ధ్వంసమైన రహదారుల మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. డోంగ్లీ మండలంలోని లింబుర్, సిర్‌పూర్ గ్రామాలతో పాటు బాన్సువాడ మండలం సంగోజీపేట– కోనాపూర్ గ్రామాల్లో వరద నష్టాన్ని మంగళవారం సబ్ కలెక్టర్ పరిశీలించారు. రహదారులపై కొనసాగుతున్న పనులను ఆమె తనిఖీ చేశారు. రోడ్లను బాగు చేయిస్తున్నామని, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులకు సూచించారు. అలాగే నష్టపోయిన పంటలను పరిశీలించారు. పంట నష్టంపై సర్వే చేసి పూర్తి వివరాలు అందించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఆమె వెంట బాన్సువాడ ఎంపీడీవో ఆనంద్, తహసీల్దార్ వరప్రసాద్, పీఆర్ ఏఈ, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, డోంగ్లీ రెవెన్యూ అధికారులు ఉన్నారు.



సంగోజీపేట్‌లో కోతకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

బీసీ బిల్లుతో బలహీన వర్గాలకు మేలు

- కాళేశ్వరం కుంభకోణం జరిగిందనడానికి కవిత వ్యాఖ్యలే నిదర్శనం
- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి

కామారెడ్డి టౌన్: అసెంబ్లీలో తీర్మానం చేసిన బీసీల 42 శాతం రిజర్వేషన్ బిల్లుతో బడుగు బలహీన వర్గాలకు ఎంతో మేలు జరుగుతుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలో మాట్లాడారు. వరద బాధితులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలిచి వారిని ఆదుకుంటుందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కాళేశ్వరం అవినీతి జరిగిందని స్వయంగా ఎమ్మెల్సీ కవిత చేసిన ఆరోపణలే నిదర్శనమన్నారు. ప్రజాధనాన్ని మాజీ సీఎం కేసీఆర్, మంత్రి హరీష్‌రావు కలిసి దోచుకున్నారని ఆరోపించారు. భారీ అవినీతి జరిగిందనే అన్ని ఆధారాలు ప్రభుత్వం వద్ద ఉండటంతోనే సీబీఐ విచారణ కోరిందన్నారు. సమావేశంలో నాయకులు రవి, జూలూరి సుధాకర్, సాయిబాబా, పంపరి శ్రీను, చాట్ల వంశీకృష్ణ, శ్రీకాంత్, సబ్బని కృష్ణహరి తదితరులున్నారు.



మాట్లాడుతున్న గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి

కొత్త పద్ధతుల్లో విద్యా బోధన

రామారెడ్డి: ఉపాధ్యాయులు నేటి సాంకేతిక యుగంలో కొత్త విధానాల ద్వారా విద్యా బోధన చేస్తున్నారని రామారెడ్డి ఎంఈవో ఆనంద్‌రావు అన్నారు. రామారెడ్డి మండల కేంద్రంలో ఎఫ్ఎల్ఎన్(ప్రాథమిక అక్షరాస్యత సంఖ్యాశాస్త్రం) మేళాను రామారెడ్డి బాలికల పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. మేళాలో ఉపాధ్యాయులు తమ విద్యార్థులకు బోధించే పరికరాలను ఇందులో ప్రదర్శించారు. ఇందులో ఉత్తమంగా ప్రదర్శించిన వారిలో పది మందిని జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు ఎంఈవో తెలిపారు. కాంప్లెక్స్ హెచ్ఎంలు ఆనంద్, గోపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు రాజు, లింబాద్రి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సులభ పద్ధతిలో పాఠాల బోధన

బాన్సువాడ : విద్యార్థులకు అర్థమయ్యే విధంగా పాఠాలు బోధించే విధానంపై అవగాహన మేళా నిర్వహించారు. బీర్కూర్ ఉన్నత పాఠశాలలో టీఎల్ఎం మేళాను ప్రత్యేక అధికారి అనీల్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఎల్ఎంను వాడి బోధించడం ద్వారా విద్యార్థులకు సులభ అర్థం చేసుకుంటారని అన్నారు. తహసీల్దార్ భుజంగరావు, ఎంఈవో వెంకటి, నాయకులు రఘు, యామ రాములు, శశికాంత్, బస్వరాజ్ తదితరులు ఉన్నారు.



ఉపాధ్యాయులు తయారు చేసిన బోధన పరికరాలు

కవితపై సస్పెన్షన్ వేటు బాధాకరం

కామారెడ్డి టౌన్: ఎమ్మెల్సీ కవితను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయడం చాలా బాధాకరమని తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు సంపత్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణా ఉద్యమంలో కీలక పాత్ర పోషించడమే కాకుండా, తెలంగాణ సంప్రదాయాలు, పండుగలను, విశ్వవ్యాప్తంగా ప్రచారం చేసిన కవితను సస్పెండ్ చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పునరాలోచన చేసి సస్పెండ్‌ను ఎత్తివేయాలని కోరారు.

లారీ దిగబడడంతో నిలిచిన రాకపోకలు



లింగంపేట: మండలంలోని లింగంపల్లి వద్ద పాముల వాగుపై తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టిన వంతెనపై భారీ లోడ్‌తో వెళ్తున్న లారీ బురదలో దిగబడిపోయింది. దీంతో కామారెడ్డి, ఎల్లారెడ్డి రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయి. బైక్‌లు, కార్లు, ఆటోలు ఇతర వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇటీవల కురిసిన భారీ వర్షానికి పాముల వాగు వంతెన పక్కన రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో వారం రోజుల పాటు భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు తాత్కాలికంగా మొరం వేసి రాకపోకలను పునరుద్ధరించారు. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో మొరం బురదగా ఏర్పడింది. వంతెనకు సైతం పగుళ్లు ఏర్పడ్డాయి. వాహన చోదకులు వంతెనపై నుంచి వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు. వాహన రాకపోకలను పాల్కంపేట రోడ్డు నుంచి అయిలాపూర్ మీదుగా కొనసాగుతున్నాయి. చుట్టూ వెళ్లాల్సివస్తుండడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

క్రైం కార్నర్

వాగులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగో టౌన్ పీఎస్ పరిధిలోని అమ్మ వెంచర్ న్యూ బ్రిడ్జి వాగులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. మృతుడి వయస్సు 38 ఏళ్ల వరకు ఉంటుందని, అతని కుడి చేతిపై మీనాక్షి అని ఇంగ్లీష్‌లో పచ్చబొట్టు ఉందన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712659840, 8712659719 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

మూడో టౌన్ పరిధిలో..

ఖలీల్‌వాడి: నగరంలోని రైల్వేస్టేషన్ వెనుక భాగంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు మూడో టౌన్ ఎస్సై హరిబాబు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మంగళవారం ఉదయం రైల్వేస్టేషన్ వెనుక భాగంలో మృతదేహం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి వయస్సు సుమారు 60 ఏళ్ల వరకు ఉంటుందని అన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712659839, 8712659717 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

అత్యాచారం కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

నిజామాబాద్ లీగల్: అత్యాచారం కేసులో ఓ నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్షను జిల్లా ప్రత్యేక మహిళా కోర్టు విధించింది. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బంటు వసంత్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఏర్గట్ల మండలం గుమ్మిర్యాల్‌కు చెందిన ఓ మహిళ బహిర్భూమికి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన జంగం రాజశేఖర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం ఆమె గర్భం దాల్చడంతో నిందితుడు ఆమెను బలవంతంగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి గర్భస్రావం చేయించాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పర్చారు. విచారణలో నేరం చేసినట్లు రుజువు కావడంతో మహిళా కోర్టు జడ్జి హరీష నిందితుడికి సెక్షన్ 366(అపహరించడం) ప్రకారం ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ. ఐదువేల జరిమానా, సెక్షన్ 376(2)(ఎన్) ప్రకారం అత్యాచారం చేయడం కింద పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. పదివేల జరిమానా, సెక్షన్ 417 ప్రకారం మోసం చేసినందుకు ఏడాది జైలు శిక్ష, రూ. ఐదువేల జరిమానా, బెదిరింపులు చేసినందుకు రెండేళ్ల జైలు శిక్ష, రూ. ఐదు వేల జరిమానా విధించారు. ఈ శిక్షలను పదేళ్ల పాటు ఏకకాలంగా విధించినట్లు జడ్జి పేర్కొన్నారు. నిందితుడి క్రూరత్వ కారణంగా బాధితురాలు శారీరకంగా, మానసికంగా బాధలకు గురైనందుకు జిల్లా న్యాయసేవా సంస్థ బాధితురాలికి రూ. ఐదు లక్షలు చెల్లించాలని జడ్జి సిఫార్సు చేశారు.

అంతర్ జిల్లా దొంగపై పీడీ యాక్టు నమోదు

కామారెడ్డి క్రైం: తరచూ దోపిడీలు, దొంగతనాలకు పాల్పడుతున్న లింగంపేట మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన అంతర్ జిల్లా దొంగ గారబోయిన శ్రీకాంత్ పై పీడీ యాక్టు నమోదు చేసినట్లు ఎస్పీ రాజేశ్ చంద్ర మంగళవారం తెలిపారు. నేరస్తుడైన శ్రీకాంత్ లింగంపేట మండలంలో ఇటీవల అమ్ముల లక్ష్మి అనే మహిళను ఆభరణాలు దోచుకోవడం కోసం హత్య చేసి పట్టుబడ్డాడు. గతంలోనూ అతనిపై దోపిడీలు, దొంగతనాలకు సంబంధించిన పలు కేసులు ఉన్నాయి. దీంతో అతనిపై పీడీ యాక్టు నమోదు చేశామని ఎస్పీ తెలిపారు. నేరస్తుడు శ్రీకాంత్ ప్రస్తుతం నిజామాబాద్ జైలులో ఉన్నాడు. పీడీ యాక్టు ఉత్తర్వులను ఎల్లారెడ్డి సీఐ రాజారెడ్డి మంగళవారం నేరస్తుడికి అందజేశారు. తరచూ నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు వాగులో పడి వృద్ధురాలి మృతి

రుద్రూర్: మండల కేంద్రంలోని కాటి వాగులో ప్రమాదవశాత్తు వృద్ధురాలు పడి మృతి చెందినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. భిక్షాటన చేసే సరవ్వ (80) అనే వృద్ధురాలు మంగళవారం రాత్రి రెండు గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వచ్చింది. బస్టాండ్‌కు వెళ్లే క్రమంలో నూతనంగా నిర్మిస్తున్న వంతెనపై నుంచి వాగులో పడిపోయిందన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు మృతదేహన్ని వెలికి తీసి పోస్ట్‌మార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ధర్పల్లిలో కత్తెర పోట్ల కలకలం..

- ఒకరి మృతి, నలుగురికి గాయాలు



లక్ష్మి(ఫైల్)

ధర్పల్లి: మండల కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీలో మంగళవారం దారుణం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్పల్లి గ్రామానికి చెందిన కోటగిరి దాసు అనే వ్యక్తి టైలరింగ్ చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. అతడికి భార్య గంగామణి ఇద్దరు పిల్లలు ఉన్నారు. దాసుకు తన భార్యతో మనస్పర్థలు రావడంతో రెండేళ్ల క్రితం విడాకులు తీసుకున్నాడు. అతని భార్య గంగామణి ధర్పల్లిలోనే నివాసం ఉంటోంది. దాసు అదే గ్రామంలో ఓ ఆశ్రమంలో ఉంటున్నాడు. తన భార్య విడిపోవడానికి అదే గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళ కారణమని ఆగ్రహించిన దాసు మంగళవారం ఉదయం లక్ష్మి ఇంటికెళ్లి కత్తెరతో ఆమె పై దాడి చేశాడు. అడ్డుగా వచ్చిన ఆమె కుమార్తె గౌతమి, అదే కాలనీకి చెందిన శెట్‌పల్లి నాగరాజు, అతని భార్య శోభ, మరో వ్యక్తి శెట్టిపల్లి భోజేశ్వర్ పై దాసు కత్తెరతో దాడి చేశాడు. దాడిలో తీవ్ర గాయాలైన లక్ష్మిని స్థానికులు నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. గాయపడ్డ మరో నలుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారికి ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. ఘటన స్థలాన్ని ధర్పల్లి సీఐ భిక్షపతి, ఎస్సై కళ్యాణి పరిశీలించి వివరాలను సేకరించారు. మృతురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యుడి అరెస్ట్

- మధ్యప్రదేశ్ నుంచి వచ్చి జిల్లాలో దొంగతనాలు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రాజేశ్ చంద్ర

కామారెడ్డి క్రైం: మధ్యప్రదేశ్ నుంచి వచ్చి జిల్లాలో దొంగతనాలకు పాల్పడుతున్న ఓ ప్రమాదకర ముఠా సభ్యుడిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రాజేశ్ చంద్ర కేసు వివరాలు వెల్లడించారు. గత జూలై 18న అర్ధరాత్రి సదాశివనగర్ మండలం మర్కల్‌లో తాళం వేసి ఉన్న రెండిళ్లలో చోరీలు జరిగాయి. దీంతో బాధితులు గుండ్రెడ్డి గంగాధర్, గుర్రపు మహేశ్‌ల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానం, ఇతర ఆధారాలతో అనుమానితుల కదలికలపై ఆరా తీశారు. సదాశివనగర్ మండలం కల్వరాల్ స్టేజీ వద్ద మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపడుతుండగా పారిపోయేందుకు ప్రయత్నించిన ఓ నిందితుడిని పట్టుకుని విచారించారు. నిందితుడు జిల్లాలో చేసిన నేరాలను అంగీకరించినట్లు ఎస్పీ తెలిపారు. అతడిని మధ్యప్రదేశ్ లోని నిముచి జిల్లా బారడియా గ్రామానికి చెందిన సికిందర్ సోన్లాల్ దర్బార్‌గా గుర్తించారు.

రాజస్థాన్ పాసింగ్ కారులో తిరుగుతూ..

పోలీసులకు చిక్కిన సికిందర్ సోన్లాల్ దర్బార్, అతని స్నేహితులు సంజు, విశాల్, అభిషేక్, ప్యూస్, అనిల్, ఉమేశ్ బాయ్, గోవింద్ బాయ్, మరొకరు కలిసి ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలింది. మధ్యప్రదేశ్‌కు చెందిన ఈ ముఠా రాజస్థాన్ నంబర్ ప్లేట్ ఉన్న కారును కొనుగోలు చేసి, దాంట్లో ప్రయాణిస్తూ కామారెడ్డి జిల్లాలో దొంగతనాలకు పాల్పడుతారన్నారు. చోరీలు చేసేందుకు అనువైన ప్రాంతాలను ఎంపిక చేసుకునే క్రమంలోనే నిందితుడు పోలీసులకు చిక్కాడని పేర్కొన్నారు. ముఠాలోని మిగితా సభ్యులను సైతం త్వరలోనే పట్టుకుంటామన్నారు. నిందితుని నుంచి కారు, సెల్‌ఫోన్, కత్తి, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు విచారణలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐలు సంతోష్ కుమార్, శ్రీనివాస్, ఎస్సైలు పుష్పరాజ్, ఉస్మాన్, ఐటీ కోర్ కానిస్టేబుల్ శ్రీనివాస్, సిబ్బంది లక్ష్మీకాంత్, శ్రీనివాసు, మైసయ్య, శ్రావణ్, రవిలను ఎస్పీ అభినందించారు.



కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

నష్ట పరిహారం కోసం దరఖాస్తు చేసుకోవాలి

రాజంపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పంటలకు నష్టం వాటిల్లిన రైతులు.. రైతు వేదికలలో దరఖాస్తులు అందించాలని ఏవో శృతి మంగళవారం పత్రికా ప్రకటనలతో తెలిపారు. తమ ఏఈవోలు సైతం గ్రామాల వారీగా పంటలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు పంట నష్టం స్పష్టంగా కనిపించే ఫొటోలతో పాటు ఆధార్ కార్డ్, పాస్‌బుక్, బ్యాంక్ ఖాతా బుక్ జిరాక్స్‌లను అందించాలని సూచించారు.

లంబోదరుడికి భక్తి శ్రద్ధలతో పూజలు



అడ్లూర్ ఎల్లారెడ్డి రైతు యువసేన గణేశ్ మండపం వద్ద భజన చేస్తున్న సభ్యులు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా గణేశ్ మండపాలలో వినాయకుడికి మంగళవారం భక్తి శ్రద్ధలతో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. కొన్నిచోట్ల నిర్వాహకులు అన్నదానాలు చేశారు. మరికొన్ని చోట్ల శోభాయాత్రలు నిర్వహించి విగ్రహాలను నిమజ్జనం చేశారు.



కామారెడ్డి అర్బన్: ఓం విఘ్నేశ్వర సిండికేట్ గణేష్ మండలి వద్ద సామూహిక కుంకుమార్చనలు



మెంగారంలో అన్నదానం

పర్యావరణహితంగా ఉత్సవాలు అభినందనీయం

కామారెడ్డి అర్బన్: కలెక్టరేట్‌లో జనహిత గణేష్ మండలి ఆధ్వర్యంలో పర్యావరణహితంగా గణేష్ ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. జనహిత గణేషుడి వద్ద మంగళవారం కలెక్టర్ పూజలు నిర్వహించి ఉద్యోగులనుద్దేశించి మాట్లాడారు. అనంతరం పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అదనపు కలెక్టర్ చందర్, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆర్.దేవేందర్, నాయకులు సుంకరి భూమయ్య, ముల్క రాజు, నాగరాజు, సాయిరెడ్డి, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్